క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్

బోథ్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బోథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా మండలంలోని కరత్వాడ గ్రామంలో గురువారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింధు విశ్వేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సమ్రీన్ సుల్తానా, ద్యాగాల హరిదాస్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు పొచ్చరలో విగ్రహాల ఆవిష్కరణ

బోథ్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని పొచ్చర గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం, కుమురం భీం విగ్రహాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆవిష్కరిస్తారని రాష్ట్ర నాయకులు కుడాల స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీచ మైనారిటీ, పేద వర్గాలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

తాంసి: సహకార బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి, రాయితీ పొందాలని ఏడీసీసీ బ్యాంకు అధికారి వివేక్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద నాబార్డ్ సౌజన్యంతో బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శన ద్వారా బ్యాంకు సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో కేశవ్, కళాబృందం సభ్యులు నారాయణ, రమేశ్, సొసైటీ సిబ్బంది సిద్ధార్థ్ రెడ్డి, సుధాకర్, గణేశ్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

తాంసి: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం సర్పంచ్ కృష్ణ గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కల్యాణ్, కాంత్‌రెడ్డి, దేవారెడ్డి, విలాస్, పరమేష్, గంగారం, సతీశ్ పాల్గొన్నారు.

పరామర్శ

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన బాతూరి గంగారం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ గోడం నగేశ్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్‌జాదవ్, తాంసి జెడ్పీటీసీ రాజు ఆయన చిత్రపటానికి గురువారం నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గ్రామస్తులు కేదారేశ్వరరెడ్డి, బరంపూర్ ఎంపీటీసీ రంజిత్ రెడ్డి, బోండ్ల వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, రమాకాంత్ మల్లయ్య పాల్గొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడలోని ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9, 10వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ఈనెల 16న 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు.

పద్మశాలి సంఘం సభ్యత్వం నమోదు

బోథ్: పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదును బోథ్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల కోసం ఓటరు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు ఆసాల సదాశివ్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సిరిపురం చంద్రమోహన్, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి మాసం అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు.

మూగజీవాల మౌనరోదన

- తాగునీటికి అల్లాడుతున్న పశువులు
- ఎండిపోయిన వాగులు, కుంటలు
- నిరుపయోగంగా నీటితొట్టీలు
- నీటి వసతి కల్పించాలని కోరుతున్న రైతులు



లింగిలో నిరుపయోగంగా నీటితొట్టి



తలమడుగులో ఎండి పోయిన వాగు

తలమడుగు: పశువుల దాహార్తి తీర్చేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేసి గ్రామాల్లో నీటితొట్టీలు నిర్మించారు. కానీ వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. తలమడుగు మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీలున్నాయి. గతంలో ఉపాధి హామీ పథకంలో పశువుల తాగునీటి కోసం అన్ని గ్రామాలోల నీటితొట్టీలను నిర్మించారు. మండలంలోని ఐదు గ్రామపంచాయతీల్లో మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. దీంతో తాగునీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. తలమడుగు మండలంలో మొత్తం పశువుల సంఖ్య 32, 300 ఉన్నాయి. అధికారులు పశువుల తొట్టీల ఆర్భాటంగా నిర్మించారు. కానీ వాటి నిర్వహణ మాత్రం మరిచారు. వీటి నిర్వహణకు గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్నచిన్న మరమ్మతులు చేస్తే అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది.

ఎండిన కాలువులు, వాగులు..

ప్రస్తుతం ఎండలు దంచి కొట్టడంతో వాగులు, కాలువలు, ఎండిపోయాయి. కొండ ప్రాంతాల సమీపంలోని కుంటల్లోని నీరు పూర్తిగా అడుగంటింది. తాగునీటి కోసం పశువులు గ్రామంలోకి వచ్చి అల్లాడుతున్నాయి. మురికి నీరు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నాయి. రైతులు వ్యవసాయ బావుల వద్దకు తీసుకెళ్లి పశువుల దాహం తీర్చుతున్నారు. గ్రామాలలో నిర్మించిన నీటితొట్టీలకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాము



గ్రామంలోని వాగులు, కుంటలు ఎండి పోయాయి, దీంతో పశువులు తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నాయి. నీరు ఎక్కడి ఉంటే అక్కడికి వెళ్లి పెడుతున్నాం. గ్రామాల్లో నీటి తొట్టీలను బాగు చేసి, పశువుల దాహం తీర్చాలి.

– కిషన్, పల్సి

మరమ్మతులు చేయాలి



గ్రామంలో నిర్మించిన పశువుల తొట్టీలకు మరమ్మతులు చేయాలి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పశువులకు తాగేందుకు నీరు అందుబాటులో ఉండడం లేదు. వేసవిలో నీరు దొరకక పశువులు ఇబ్బంది పడుతున్నాయి.

– అయ్యూబ్, లక్ష్మీపూర్

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో నిర్మించిన పశువుల తొట్టీలు నిరుపయోగంగా ఉండడం వాస్తవావే. కొన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం లేక, మరికొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తీసుకువస్తాం.

– దిలీప్, ఎంపీవో, తలమడుగు

బీజేపీ నాయకులది అసత్య ప్రచారం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

కైలాస్‌నగర్: తెలంగాణలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి దిక్సూచిగా నిలుస్తుంటే, కేంద్ర నిధులతోనే అమలు చేస్తున్నారని బీజేపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. పట్టణంలోని భుక్తాపూర్ వార్డు పరిధిలో రూ.50లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలకు గురువారం భూమిపూజ చేశారు. కొత్తగా 163 మందికి మంజూరైన ఆసరా పెన్షన్ కార్డులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు వాస్తవాలను గ్రహించి అసత్య ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, కౌన్సిలర్ వెనుగంటి ప్రకాష్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్ పాల్గొన్నారు.

తునికాకు కొనుగోళ్లు ప్రారంభించాలి



మాట్లాడుతున్న జిల్లా నాయకుడు జగన్‌సింగ్

ఎదులాపురం: జిల్లాలో త్వరలో తునికాకు కొనుగోళ్లు ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. 50 తునికాకుల కట్టకు 5 రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన పేదల శ్రమను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటుందని ఆరోపించారు. కష్టపడి తునికాకు సేకరిస్తే గుత్తేదారులే లాభపడుతున్నారు తప్పా.. గిరిజనుల కష్టానికి ఫలితం దక్కడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌరాల సుభాష్, నితిన్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణకు భారీగా తరలివచ్చిన ప్రజలు

- జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ
- నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసినా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం అట్టహాసంగా నిర్వహించారు. దళితులు, సంఘాల ప్రతినిధులు, ఉపాసికులు, సమత సైనిక్ దళ్ కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే జోగు రామన్న జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్లు నటరాజ్, రిజ్వాన్ భాషా షేక్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహావిష్కరణ అనంతరం వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్, డీఎస్పీ ఉమేందర్, కౌన్సిలర్ బండారి సతీశ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, సుహాసిని రెడ్డి, రంగినేని మనిషా, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న నాగభూషనం

ఉట్నూర్‌రూరల్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఐటీడీఏ ఉట్నూర్ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు స్థానిక యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 183 మంది గిరిజన యువతి యువకులు హాజరయ్యారు. ఇందులో నుంచి 98 మంది ఎంపికయ్యారని జాబ్స్ జిల్లా కోఆర్డినేటర్ నాగభూషనం పేర్కొన్నారు. ఏవో నాగోరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



నేరడిగొండ: జలాభిషేకం చేస్తున్న నాయకులు



బోథ్: నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆదిలాబాద్‌టౌన్: అంబేద్కర్ జయంతిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ జలగం అనిత మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాత్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని వివేకానంద పాఠశాలలో గురువారం అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి జలాభిషేకం

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం అంబేద్కర్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. శుక్రవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ పిలుపుమేరకు అంబేద్కర్ విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చొక్కపెల్లి రాములు, దళిత మోర్చా మండల అధ్యక్షుడు ధర్మపురి రాఘవులు, కూన రాములు, వీడీసీ సభ్యులు లింగన్న, గంగమల్లు, లక్ష్మణ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రశ్నపత్రాలు తయారు చేసిన బోథ్‌లోని వేదం పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ కొట్నూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జీవో నం.33ను అధిగమించి ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్ష నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నరేందర్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



సమ్మె నోటీసు అందజేస్తున్న వీవోఏలు

బేల: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు ప్రమోద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీసీ ప్రమోద్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించపోతే ఈనెల 17నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీవోఏలు సంజయ్, సల్మాన్, దీపక్, గంగాధర్, దత్తాత్రి, గణేష్, ప్రఫుల్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

బీటీరోడ్డు వేయండి సారూ..



నార్నూర్: గాదిగూడ మండలంలోని పిప్రి నుంచి కుండి కొలాంగూడ, గొందుగూడ, చిన్నకుండి గ్రామాలకు దాదాపు 17 కిలోమీటర్లు బీటీ రోడ్డు లేకపోవడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇక అంతే సంగతి. ఐటీడీఏ అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని గిరిజనులు కోరుతున్నారు.

– సంబంధిత అధికారి: రాథోడ్ భీంరావు, ఐటీడీఏ ఈఈ, ఫోన్: 94911 93941

పీహెచ్‌సీలో ఇష్టారాజ్యం



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



డాక్టర్ కోసం వేచిచూస్తున్న ప్రజలు

- విధులకు హాజరు కాని డాక్టర్
- వారంలో ఒకట్రెండు రోజులు మాత్రమే

నేరడిగొండ: నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. వారంలో ఒకట్రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నట్లు చెబుతున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో సిబ్బందే మందులు ఇచ్చి పంపిస్తున్నారు. అయితే వ్యాధి నయం కాకపోవడంతో ప్రజలు ప్రైవేటు బాట పడుతున్నారు. మరో డాక్టర్ వెంకటేశ్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆయుర్వేద డాక్టర్ ప్రవీణ నిజామాబాద్ జిల్లా దేగామకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు. ఆయా గ్రామాల నుంచి ప్రతిరోజు 70 నుంచి 90 వరకు ప్రజలు పీహెచ్‌సీకి వస్తుంటారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో వారికి వైద్యం అందని ద్రాక్షగానే మారుతోంది. డాక్టర్ ఎండీ సద్దాంను 'సాక్షి' వివరణ కోరగా ఈరోజు ఆస్పత్రికి రాలేదని సమాధానం ఇచ్చారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

సిరికొండ: లోక్ అధాలత్ ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవచ్చని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, మీటర్లకు ఎక్కువ బిల్లులు వస్తున్నాయని, ఇళ్లపైన విద్యుత్ తీగలు తొలగించాలని దాదాపుగా 31 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ చౌర్యానికి పాల్పడవద్దని, బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద యూనిట్ల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ అధికారులు అశోక్, కిషన్, భూమారెడ్డి, ఎస్‌ఈ సంపత్ కుమార్, డీఈలు సుభాష్, ఈదన్న, ఎస్‌ఏవో డిగంబర్, ఏడీఈ చంద్రశేఖర్, ఏఈలు రోహిదాస్, శ్రావణ్, శ్రీనివాస్, గౌతమ్, లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, సర్పంచ్ నర్మద పెంటన్న పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను మోసం చేసిన ఏలేటి'



మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: కన్నతల్లి లాంటి కాంగ్రెస్‌ను ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మోసం చేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అతనికి ఎలాంటి ద్రోహం చేయలేదని ప్రజారాజ్యం నుంచి ఒక్కసారి మాత్రమే ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ పార్టీ గుర్తించి ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. పార్టీ బలోపేతం కోసం ఏరోజు కూడా ఒక్క కార్యక్రమాన్ని ఇప్పటి వరకు చేయలేదన్నారు. మహేశ్వర్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నా.. డిపాజిట్లు కూడా రావన్నారు. ఈకా ర్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర్, దేవానందం, జైవంత్‌రావు, నాగనాథ్, లాజర్, నిసార్, మారుతి, గంగారాం, నగేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మా ప్రయాణం

బోథ్: ఏఐసీసీ వ్యవహారాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో బోథ్ నియోజకవర్గ నాయకులు స్పందించారు. కాంగ్రెస్‌తోనే ఉంటామని, పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. గురువారం నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటిలు మాట్లాడుతూ.. మహేశ్వర్ రెడ్డి రాజీనామా ఆయన వ్యక్తిగతమన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు.